శిథిలావస్థలో పశువైద్య భవనాలు

- మూటపల్లి తాత్కాలిక భవనంలో పశు వైద్యసేవలు
- ఇబ్బందుల్లో పాడి రైతులు



భూపతిపూర్‌లోని పశువైద్యశాలలో కుంగిన పైకప్పు

రాయికల్: మండలంలోని మూటపల్లి భూపతిపూర్ గ్రామాల్లోని పశువైద్య సబ్‌సెంటర్‌లో పశువైద్య భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనాల్లో వర్షం కురిస్తే వర్షపు నీరు రావడంతో పాటు, పైకప్పుల్లో ఉన్న పెచ్చులు పడిపోవడంతో పశువైద్య సిబ్బంది సైతం భయంభయంగా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని మూటపల్లి పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా పశువైద్య సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో తాత్కాలికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. దీంతో గ్రామంలోని పశువులకు, గేదెలకు సరైన వైద్య సేవలు అందించాలంటే పశువైద్య సిబ్బంది సైతం సరైన పనిముట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా మండలంలోని భూపతిపూర్ సబ్‌సెంటర్‌లో వర్షం కురిస్తే వర్షం నీరు చేరడంతో పాటు, ఉన్న మందులు సైతం తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూపతిపూర్ సబ్‌సెంటర్ పరిధిలోకి భూపతిపూర్, ఒడ్డెలింగాపూర్ ధర్మాజీపేట, కట్కాపూర్, దావన్‌పల్లి, కై రిగూడెం, తాట్లవాయి గ్రామాలు ఉండగా, 8500 గొర్రెలు, 1640 ఆవులు, 2128 గేదె లున్నాయి. మూటపల్లి సబ్‌సెంటర్ పరిధిలో బోర్నపల్లి, జగన్నాథపూర్, చింతలూరు, బషీర్‌పల్లి, వస్తాపూర్, ఒడ్డెరకాలనీ, మూటపల్లి గ్రామాలు ఉండగా 11228 ఆవులు, గేదెలు, 2200 గొర్రెలు, మేకలున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి శిథిలావస్థలో ఉన భవనానికి నిధులు మంజూరు చేయించాలని యాదవ, పాడి రైతులు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న మూటపల్లి పశువైద్యశాల

నూతన భవనం మంజూరు చేయాలి



మా గ్రామంలో ఏళ్ల క్రితం నిర్మించిన సబ్‌సెంటర్ భవనం శిథిలావస్థలో ఉంది. వర్షం కురిస్తే పశువైద్య సిబ్బంది, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి నూతన భవనం మంజూరు చేయాలి. – ఎలేటి రాజేందర్‌రెడ్డి, రైతు, మూటపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండలంలోని మూటపల్లి, భూపతిపూర్ సబ్‌సెంటర్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ విషయంపై జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాగానే పనులు చేడతాం.
– శ్రీనివాస్,మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి

సీఎం,మంత్రి, ఎమ్మెల్సీ, విప్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం





రంగపేటలో సీఎం, ఎమ్మెల్సీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు కథలాపూర్‌లో..

సారంగాపూర్: మండలంలోని రంగపేటకు వెళ్లే రోడ్డు సమస్యను ప్రభుత్వం పరిష్కరించడంపై గ్రామస్తులు శుక్రవారం సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సమస్యను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా, ఆయన స్పందించి నిధుల మంజూరుకు కృషి చేశారు. బస్టాండ్ నుంచి రంగపేటకు రూ.1.65 లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో సీఎం, ఎమ్మెల్సీ, మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ధర్మపురి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామడుగు రవి, పార్టీ మండల అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి, నాయకులు మాలెపు విమల, సామల్ల గంగాధర్, ఎగ్గె మల్లయ్య, ఏదుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం,విప్ చిత్రపటాలకు..

కథలాపూర్: మండలంలోని మోడల్‌స్కూల్ రోడ్డు మరమ్మతుకు రూ. 1.30 కోట్లు, దూలూర్– తక్కళ్లపెల్లి గ్రామాల మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 85 లక్షలు మంజూరు చేయడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, పూండ్ర నారాయణరెడ్డి, జవ్వాజి రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

మల్యాల: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఫాతిమా అడోరేషన్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ ప్రీతా అన్నారు. మండలంలోని తాటిపల్లిలో 20 మంది మహిళలకు శుక్రవారం కుట్టు మిషన్లు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రీతా మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు తమ సంస్థ తరపున ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతోపాటు, మిషన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ ఫాం అడ్వైజర్ శాస్త్రవేత్త డాక్టర్ రంగనాయకులు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ కోసం పండ్లు ఎంతగానో ఉపయోగపడుతాయని, సీజనల్ పండ్లు తినాలని సూచించారు. కార్యక్రమంలో ఆయిల్ ఫాం అడ్వైజర్ శాస్త్రవేత్త డాక్టర్ రంగనాయకులు, మాజీ ఎంపీపీ దొంగ ఆనందరెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ దీప్తి, సిస్టర్ నవ్య, వెలాంగిని, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఇబ్రహీంపట్నం: మూగజీవాల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట పశువైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రవీందర్, సాయన్న పాల్గొన్నారు.

విద్యార్థినికి గ్రామస్తుల అభినందన

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన కందుకూరి తపస్వీ ఇండియన్ మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్ష రాసి ఆర్ఎంవో (రీజినల్ మ్యాథ్స్ ఒలంపియాడ్) పరీక్షకు అర్హత సాధించడంపై గ్రామస్తులు తపస్విని అభినందించారు. తపస్వినితో పాటు, ఆమె తల్లితండ్రులు తిరుపతి, స్వప్నలను గ్రామస్తులు సన్మానించారు.

పేద విద్యార్థులకు షూ పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ ఉన్నత పాఠశాలలో 22 మంది పేద విద్యార్థులకు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ నల్ల తిరుపతిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు బైరీ వెంకటస్వామిలు రూ. 10వేల విలువ గల షూలను శుక్రవారం అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంపల్లిలో శివాలయ అభివృద్ధికి విరాళం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో అతి పురాతన శివాలయం అభివృద్ధికి రాయికల్ మండలం రామాజీపేట మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జకిలేటి హరీష్‌రావు శుక్రవారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.11,111లను విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్‌లో రత్నాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన దేవరాణి భర్త గల్ఫ్ వెళ్లి వచ్చి అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి శుక్రవారం బృందావనం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ సాతారం గంగాధర్ రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సుద్దపల్లి రంజిత్, బోడ ప్రశాంత్, కిరణ్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలపై అవగాహన

ధర్మపురి: మండలంలోని దొంతాపూర్ గ్రామపంచాయతీ వద్ద శుక్రవారం జీఎంఆర్ ప్రతిమ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ అల్లె రాజేశం ఆధ్వర్యంలో స్త్రీల ఆరోగ్యంపై వారు తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తమ సంస్థ సహకారంతో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మోహన్, భూంరెడ్డి, తిరుపతి, రాజన్న పాల్గొన్నారు.

వివరాల సేకరణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

సారంగాపూర్: అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాల సేకరణలో నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ సమియొద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగునూర్, లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి గ్రామాల్లోని ఎన్‌సీడీ రీ స్క్రీనింగ్ సబ్‌సెంటర్లను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసంక్రమిత వ్యాధులు (నాన్ కమ్యూనికేబుల్ డిసీసెస్) బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేయడం, వివరాలు నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. రేచపల్లి, నాగునూర్‌లో రీస్క్రీనింగ్ కార్యక్రమంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇద్దరు ఏఎన్ఎంలకు మెమోలు జారీ చేయాలని మండల వైద్యాధికారి శివకుమారిని ఆదేశించారు. ఆయన వెంట ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ మురళి, సీహెచ్‌వో కుద్దుస్, సిబ్బంది ఉన్నారు

టీచర్లు ఓటరుగా నమోదు చేసుకోవాలి

సారంగాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేయించుకోవాలని పీఆర్‌టీయూ (టీఎస్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోవర్ధన్ ప్రసాద్, తోట రాజేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఓటు వేయడానికి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు మానేరు శంకరయ్య, సంగ శ్రీధర్, రాజనర్సయ్య, ఉమేశ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

రాయికల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోవాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేశ్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, గాజంగి రాజేశం, తాటిపాముల వేణుగోపాల్ పాల్గొన్నారు.

గణిత ఫోరం రాష్ట్ర సలహాదారుగా రాంప్రసాద్

కోరుట్ల రూరల్: గణిత ఫోరం రాష్ట్ర సలహాదారుగా కోరుట్లకు చెందిన చౌడారపు రాంప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఈవోలు నరేశం, లోకిని శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, బండారు మధు, పలువురు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. గణిత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాంప్రసాద్ తెలిపారు.

అలరిస్తున్న ఇండియన్ ఫెస్టివల్



వివిధ వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్స్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర టెంపుల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ ఫెస్టివల్ షాపింగ్ ఎక్స్‌పో ప్రజలను ఆకట్టుకుంటోంది. దాదాపు ఇందులో 5 వేల రకాల వస్తువులు ఏర్పాటు చేశారు. స్పెషల్‌గా హ్యాండ్లూమ్స్, ఖాదీ షర్ట్స్, వివిధ బ్యాంగిల్స్, చెప్పల్స్, కప్స్ ఎన్నోరకాల వస్తువులను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రజలు ఎక్స్‌పో షాపింగ్ సెంటర్‌కు తరలివెళ్తున్నారు.



జగిత్యాలటౌన్: పట్టణంలోని ధరూర్ క్యాంపు రామాలయం వెనుక వైపు నుంచి అంతర్గాం బైపాస్ రోడ్డు వెంట పడేస్తున్న చెత్త, వ్యర్థాలతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపించి అటువైపు వెళ్లే స్థానికులు, వాకర్స్ ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై పారిశుధ్య విభాగం అధికారులతో పాటు కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త, వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చిరంజీవి, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల, సెల్ నంబర్:9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

సంక్షిప్త వార్తలు

జేఎన్‌టీయూను యూనివర్సిటీగా తీర్చిదిద్దుతా

జగిత్యాల: ఉత్తర తెలంగాణకు తలమానికంగా ఉన్న కొండగట్టు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీగా తీర్చిదిద్దుతానని, అలాగే నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు వాకర్స్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే నిరుద్యోగ, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతానని, పెద్దల సభలో చట్టాల రూపకల్పనలో ముందుంటానన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రథమ కర్తవ్యమన్నారు. ఆయన వెంట నాయకులున్నారు.

ఆస్పత్రి విధి విధానాలు వంద శాతం చేపట్టాలి

ధర్మపురి: ప్రభుత్వ ఆస్పత్రిలో చేపట్టనున్న పలు అంశాలు, విధి విధానాలను వంత శాతం చేపట్టాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నేరెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో డాక్టర్లు, సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆస్పత్రిలో చేపట్టే పలు అంశాలు సూచికలపై సమీక్ష నిర్వహించారు. వాటిలో ఫివర్ సర్వే, గర్భిణుల పేర్లు నమోదు, పరీక్షలు, కాన్పులు, వ్యాధి నిరోధక టీకాలు, ఎన్‌సీడీ రీస్క్రినింగ్, రికార్డులు, రిజిష్టర్లు తదితర అంశాలపై చర్చించారు. పైన పేర్కొన్న ఇండికేటర్స్ అన్ని వంద శాతం అచీవ్‌మెంట్ కావాలని ఆదేశించారు. ముఖ్యంగా ధర్మపురిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీలు అయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి

మెట్‌పల్లి: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో శుక్రవారం మెట్‌పల్లి సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వీటిని డీఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని మెరుగుపర్చడానికి పోటీలు దోహదపడుతాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కోరుట్ల/కోరుట్ల రూరల్/మల్లాపూర్: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, కౌన్సిలర్లు సత్యం, సజ్జు,సునీల్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

జగిత్యాల: విద్యార్థులు చదువుతో పాటు, వివిధ రంగాల్లో రాణించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌కు హాజరై మాట్లాడారు. సైన్స్‌ఫేర్‌లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కాని విద్యార్థులు నిరుత్సాహ పడకుండా మరోసారి ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పొరండ్ల, బాలపల్లి, కండ్లపల్లి, కన్నాపూర్, హన్మాజీపేట గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు..

కల్లెడ సబ్‌స్టేషన్ పరిధిలో...

జగిత్యాల రూరల్ మండలం కల్లెడ సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లెడ, అనంతారం, గుట్రాజ్‌పల్లి, తక్కళ్లపల్లి, హబ్సీపూర్, సోమన్‌పల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు

ఉచిత కంటి వైద్య శిబిరం

గొల్లపల్లి: మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రెడ్డి సంఘం భవనంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, 30 మందిని కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి రేకుర్తి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్కు కరుణాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బొమ్మెన కుమార్, కార్యదర్శి సాయిని నరహరి,కోశాధికారి శాతాల్ల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెగడపల్లి: మండలంలోని మ్యాకవెంకయ్యపల్లిలో ఇటీవల రోడ్ ప్రమాదంలో గాయపడిన అలువాల రమ్యకృష్ణ (30) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రామడుగు మండలం గోపాలరావుపేటకు చెందిన అలువాల విష్ణు–రమ్యకృష్ణ దంపతులు పెగడపల్లి మండల కేంద్రంలో లేడీస్ ఎంపోరియం నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న తమ స్వగ్రామం గోపాల్‌రావుపేట వెళ్లి ద్విచక్రవాహనంపై పెగడపల్లి వస్తుండగా, ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం డీకొట్టి తీవ్రంగా గాయ పడిన రమ్యకృష్ణ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తున బావిలో పడి..

పెగడపల్లి:మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఎట్టెం మల్లయ్య (67) అనే వ్యకి ప్రమాదవశాత్తున్న బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా రేచీకటి సమస్యతో బాధ పడుతున్న మల్లయ్య కళ్లు కనపడగా బావిలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఏడీఏగా తిరుపతి నాయక్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల ఏడీఏగా తిరుపతినాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఏడీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జగిత్యాల రూరల్ వ్యవసాయాధికారిగా పనిచేస్తున్నారు. ఏడీఏ పోస్టు ఖాళీగా ఉండటంతో తిరుపతినాయక్‌ను ఇన్‌చార్జి ఏడీఏగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా వ్యవసాయాధికారి రాంచంద్రంను కలిశారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. బట్టపల్లికి ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు రావడంతో తాము తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని, గ్రామానికి రోజు 5 సార్లు బస్సులు వచ్చి, వెళ్లేలా చూడాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడారు. బస్సులు డీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీలు



పోటీల్లో తలపడుతున్న బాలికలు

జగిత్యాలటౌన్: జిల్లాస్థాయి అండర్– 14, 17 బాలబాలికల కరాటే ఎంపిక పోటీలు శుక్రవారం పట్టణంలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. పోటీల్లో 300 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చినవారు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీరాం నాయక్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు, దయాకర్, విజయ, యమున, కరాటే ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



అంగన్‌వాడీలో తనిఖీ చేస్తున్న సీడీపీవో

పెగడపల్లి: మండలంలోని పెగడపల్లి, ఆరవెల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం మల్యాల ఐసీడీఎస్ పీడీ వీరలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పరిశీలించి, పౌష్టికాహారం పంపిణీ జరుగుతున్న తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో పిల్లలకు, లబ్ధిదారులకు అందిస్తున్న పోషకాహారం పాలు, గుడ్ల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం చిన్నారులు, లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. పిల్లల ఎత్తులు, బరువులను తీయించి ఎదుగుదల లోపం ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. సూపర్‌వైజర్ మహేశ్వరీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి



సభ్యత్వం చేయిస్తున్న ఎస్టీయూ నాయకులు

సారంగాపూర్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏలను పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. జీపీఎఫ్, సరెండర్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, బీఈడీ పూర్తిచేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు సైతం పీఎస్ హెచ్ఎం పదోన్నతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జోగ రవి, మండల అధ్యక్షుడు గుండెల నరేశ్, విద్యామణి కృష్ణ పాల్గొన్నారు.

కొమురం భీంకు నివాళి

రాయికల్: నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కొమురంభీం వర్ధంతి వేడుకలను శుక్రవారం రాయికల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్రం రవీందర్, నాయకులు పాల్గొన్నారు.